# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 31 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మంత్రిగా అజారుద్దీన్ నేడు ప్రమాణ స్వీకారం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. శుక్రవారం మధ్యాహ్నం 12:15 గంటలకు కొత్త మంత్రి ప్రమాణ స్వీకారం జరగనుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ భారత క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ కొత్తగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి సంబంధించి ప్రభుత్వ అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. దర్బార్ హాల్‌లో సీటింగ్ మరియు ప్రోటోకాల్ ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మరో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేయడంతో కేబినెట్ సభ్యుల సంఖ్య 15కి చేరింది. ఇక మిగిలిన మూడు మంత్రి పదవుల భర్తీపై అధిష్టానం చర్చలు జరిపింది. ఈ పదవుల్లో ఒకదాన్ని మైనారిటీ వర్గానికి కేటాయించాలని హైకమాండ్ నిర్ణయించింది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్ పేరును ఖరారు చేసింది. అజారుద్దీన్‌కు హోం శాఖ లేదా మైనారిటీ సంక్షేమ శాఖ బాధ్యతలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. మిగిలిన రెండు మంత్రి పదవుల భర్తీపై త్వరలో అధిష్టానం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

### తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో
# ధాన్యం సేకరణకు ప్రాధాన్యతనివ్వాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మొంథా తుపానుపై సీఎం సమీక్షా సమావేశం
- ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు భేటీ..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ధాన్యం సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మొంథా తుపాను వల్ల ఉత్పన్నమైన పరిస్థితులను గమనంలోకి తీసుకుని ప్రతి కొనుగోలు కేంద్రానికి మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించి బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. మొంథా తుపాను ప్రభావిత జిల్లాల్లో తీసుకున్న జాగ్రత్తలు, తీసుకోవలసిన చర్యలు, తక్షణం చేపట్టాల్సిన కార్యాచరణ, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి గారు మంత్రులు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన చర్యలపై ముఖ్యమంత్రి అధికారులకు సూచనలిచ్చారు. అధికారుల సెలవులను రద్దు చేసి క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రం నుంచి ప్రతి 24 గంటల పరిస్థితిపై రోజువారిగా కలెక్టర్లకు నివేదికలు అందించాలని చెప్పారు. నివేదికలు అందించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని చెప్పారు. ధాన్యం సేకరణలో పౌర సరఫరాల విభాగం ఎప్పటికప్పుడు కలెక్టర్లకు పరిస్థితులను వివరిస్తూ అవసరమైన సూచనలు చేయాలన్నారు. వరి కోతల కాలంలో తుపాను కారణంగా అనుకోని ఉపద్రవం రైతుల్లో తీవ్ర ఆవేదన మిగుల్చుతుందని, ఇలాంటి సందర్భాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పరిస్థితులకు అనుగుణంగా ధాన్యాన్ని దగ్గరలోని ఫంక్షన్ హాళ్లకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని, పర్యవేక్షణ కోసం జిల్లా కలెక్టర్, ఎస్పీలు సంయుక్తంగా ఒక మానిటరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా ఇంచార్జీ మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం అన్ని రకాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు. సహాయక చర్యలను ఎలాంటి లోటు లేకుండా, ఎక్కడా ప్రాణ నష్టం జరక్కుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ట్రాఫిక్‌ను మళ్లించాలని, ఎక్కడా ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరక్కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా చెరువులు, వాగులు, మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, లోలెవల్ కల్వర్టుల వద్ద పరిస్థితిపై స్థానికులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**వరంగల్‌లో సహాయక చర్యలపై సీఎం సమీక్ష..**

మొంథా తుపాను వల్ల తీవ్ర ప్రభావానికి గురైన వరంగల్, హనుమకొండ తదితర ప్రాంతాల్లో వరద బాధితుల కోసం సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వరద ప్రభావత ప్రాంతాలకు వెంటనే అవసరమైనన్ని పడవలను పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని, రాష్ట్ర డీజీపీ ని ఆదేశించారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో వరద సహాయక చర్యలపై ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. అత్యవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం, హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామగ్రిని వినియోగించాలని ఆదేశించారు.

ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. వరద ప్రాంతాల్లో ఎక్కడైనా ఇండ్ల కప్పులు, బంగ్లాల్లో చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా అవసరమైన ఆహారం, మంచినీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తతతో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని చెప్పారు. ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈరోజు తలపెట్టిన వరంగల్ జిల్లా పర్యటనను వాయిదా వేసుకున్న ముఖ్యమంత్రి గురువారం రోజున వరంగల్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు.

## ఛఠ్ పండుగకు యునెస్కో వారసత్వ గుర్తింపునకు కృషి

- ప్రధాని మోడీ
- బీహార్‌లో ఎన్నికల ప్రచారం



**బలగం టీవీ, ముజఫర్‌పూర్**

ఛఠ్ పూజను కాంగ్రెస్, ఆర్‌జేడీ డ్రామాగా పేర్కొనడం బీహార్ ప్రజల భక్తికి అవమానమని మోడీ అన్నారు. బీహారీ ప్రజలు ఎంతో ఆప్యాయంగా జరుపుకునే ఈ ఛఠ్ పండుగకు యునెస్కో వారసత్వ గుర్తింపు తీసుకురావడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముజఫర్‌పూర్‌లో జరిగిన సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆర్‌జేడీ, కాంగ్రెస్ పార్టీలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీహార్‌ను దశాబ్దాలుగా పాలించిన ఈ పార్టీలు అభివృద్ధి చేయలేకపోయాయని, ప్రజలకు కేవలం ద్రోహం, తప్పుడు వాగ్దానాలు మాత్రమే ఇచ్చాయని ఆయన విమర్శించారు. బీహార్ మధురమైన భాష, గొప్ప సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చేయడం, గౌరవాన్ని పెంచడం, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడం బీజేపీ, ఎన్‌డీఏ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మోదీ తెలిపారు. వికసిత్ భారత్ సాధనకు వికసిత్ బీహార్ ఎంతో అవసరమని ఆయన స్పష్టం చేశారు.


ఆర్‌జేడీ–కాంగ్రెస్ కూటమి పాలనను ఐదు "కే" పదాల్లో చెప్పవచ్చని ప్రధాని అన్నారు. కట్టా (అక్రమ తుపాకీలు), క్రూరతా (క్రూరత్వం), కటుత (దురుద్దేశం), కుశాసన (పరిపాలన లోపం), కరప్షన్ (అవినీతి) అనే ఐదు అంశాలే వారి పాలనకు నిదర్శనమని విమర్శించారు. ఆర్‌జేడీ పాలనలో బీహార్‌లో 35 నుండి 40 వేల కిడ్నాప్ కేసులు నమోదయ్యాయని, ఆ రోజుల్లో ప్రజలు భయంతో వణికిపోయారని గుర్తుచేశారు. ఏడుస్తున్న తల్లిదండ్రుల బాధ ఆ పార్టీ నేతలకు పట్టలేదని, ఇప్పటికీ ప్రజల సంతోషం, దుఃఖం పట్ల వారికెలాంటి ఆందోళన లేదని మండిపడ్డారు.

ఎక్కడైతే ఆర్‌జేడీ, కాంగ్రెస్ దుష్పరిపాలన ఉందో అక్కడ అభివృద్ధి జాడ కనిపించదని ప్రధాని అన్నారు. అవినీతి ఉన్నచోట సామాజిక న్యాయం జరగదని, పేదల హక్కులు దోచుకుపోతారని ఆరోపించారు. కొన్ని కుటుంబాలే అభివృద్ధి చెందేలా అవినీతి పాలన సాగుతోందని మోదీ అన్నారు. ఆర్‌జేడీ అధికారంలో ఉన్న రోజుల్లో షోరూమ్‌ల నుంచి వాహనాలు దోచుకుపోయిన ఘటనలు బీహార్‌లో సాధారణమని ఆయన గుర్తుచేశారు. ఛఠ్ పాటలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయి పోటీ నిర్వహించనుందని, ఇందులో ప్రజలే విజేతలను నిర్ణయిస్తారని తెలిపారు. వచ్చే ఏడాది ఛఠ్ పండుగకు ముందు విజేతలను ప్రకటిస్తామని వెల్లడించారు. మోదీ మాట్లాడుతూ, "ఛఠ్ పండుగ భక్తికి మాత్రమే కాదు, సమానత్వానికి ప్రతీక. ఈ పండుగలోని ఆత్మను యువత పాటల ద్వారా నేర్చుకోవాలి. బీహార్ అభివృద్ధి, భారత వికాసం రెండూ విడదీయరానివి" అని అన్నారు.

## కొత్త సీజేఐ నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర

- నవంబర్ 24న బాధ్యతలు స్వీకరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి సంబంధించిన ప్రక్రియ పూర్తయింది. సీజేఐగా ఆయన నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబర్ 24న బాధ్యతలు స్వీకరించనున్నారు. 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేయనున్నారు. సుప్రీంకోర్టు సీజేఐగా బాధ్యతలు చేపట్టబోతున్న తొలి హరియాణా వాసిగా ఆయన నిలవనున్నారు.

కేంద్ర న్యాయమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఈ నియామకంపై అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ బీఆర్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు.

1962 ఫిబ్రవరి 10న హరియాణా రాష్ట్రంలోని హిస్సార్ జిల్లాలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన జస్టిస్ సూర్యకాంత్, 1981లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అనంతరం 1984లో మహర్షి దయానంద్ యూనివర్సిటీ, రోహ్‌తక్ నుండి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అదే ఏడాది హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించి, 1985లో పంజాబ్–హరియాణా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ అడ్వకేట్‌గా గుర్తింపు పొంది, 2004లో ఆ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

## మోడీకి ట్రంప్‌ను ఎదురించే ధైర్యం లేదు



- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**బలగం టీవీ, నలంద**

ప్రధాని నరేంద్ర మోదీకి అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలను ఖండించే ధైర్యం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. బిహార్‌లోని నలందలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ ప్రధానిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "భారత్–పాక్ విషయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలను మోదీ ఖండించలేకపోయారు. ఇందిరా గాంధీ కాలంలో అమెరికా భారత్‌ను బెదిరించినా ఆమె వెనక్కి తగ్గలేదు. కానీ మోదీ పిరికివారు. ట్రంప్ ఇప్పటికే 50 సార్లు ఆయనను అవమానించారు. అయినా ఒక్క మాట కూడా మాట్లాడే ధైర్యం ఆయనకు లేదు" అని అన్నారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధం సందర్భంలో ఇందిరా గాంధీ చూపిన ధైర్యాన్ని గుర్తుచేసుకుంటూ రాహుల్ అన్నారు "అమెరికా తన నౌకాదళాన్ని భారత్ వైపు పంపింది. కానీ ఇందిరా గాంధీ ధైర్యంగా ఎదుర్కొన్నారు. ఆమె మహిళ అయినా, నిజమైన నాయకత్వం ఎలా ఉండాలో చూపించారు. నరేంద్ర మోదీకి ఆ ధైర్యం లేదు. ఆయన అమెరికా అధ్యక్షుడిని ఎదిరించలేరు" అని విమర్శించారు.

రాహుల్ గాంధీ మాట్లాడుతూ దేశంలో రెండు హిందూస్థాన్‌లు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఒకటి అదానీ, అంబానీ, మోదీలదని, మరొకటి ప్రజలదని అన్నారు. "రెండో హిందూస్థాన్ మీది ప్రజలది. కానీ అందులో మీరు ఎంత కష్టపడ్డా ఉద్యోగాలు రావు. ఎందుకంటే ప్రధాని మోదీ అదానీ, అంబానీల చేత చైనా వస్తువులను అమ్మిస్తున్నారు. వాటిని బిహారీలు కొనుగోలు చేస్తున్నారు" అని అన్నారు. "మోదీ బీహార్‌కి వచ్చి యువతకు 'మేము మొబైల్ డేటా చౌక చేశాం' అని చెబుతున్నారు. దాంతో మీరు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తారని ఆయన అంటున్నారు. కానీ రీల్స్ చూస్తే మీ జేబులోకి డబ్బు వస్తుందా? కాదు. మీరు ఇన్‌స్టా చూస్తే అంబానీ జేబులోకి డబ్బు వెళుతుంది" అని రాహుల్ విమర్శించారు.

బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ పాలనను రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. బిహార్ రాష్ట్రం పేపర్ లీకేజీలకు, పేలవమైన ఆరోగ్య సదుపాయాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. అలాగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన "బిహార్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు భూమి లేదు" అన్న వ్యాఖ్యలను తప్పుబట్టారు. "అయితే అదానీ వంటి వ్యాపారవేత్తలకు రూపాయికే భూమి ఎలా కేటాయిస్తున్నారు?" అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీ ద్వారానే ఎన్‌డీఏ అధికారం చేపట్టిందని అన్నారు. "ప్రజల అసలు సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం అదానీ, అంబానీల కోసం మాత్రమే పని చేస్తోంది" అని మండిపడ్డారు.



## తుఫానుతో హైదరాబాద్-శ్రీశైలం హైవే ధ్వంసం

- వరద నీరు తగ్గిన వెంటనే రోడ్డు పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవీ, నాగర్‌కర్నూల్**

మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురిశాయి. వరదల కారణంగా అనేక ప్రాంతాల్లో రహదారి వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నది. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ జిల్లా లట్టిపూర్ గ్రామం వద్ద ఉన్న హైదరాబాద్%–%శ్రీశైలం హైవే (ఎన్‌హెచ్–765) వద్ద రహదారి భారీగా కొట్టుకుపోవడంతో ఆ మార్గంలో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. భారీ వర్షాల కారణంగా హైవేలోని 111/335 కిలోమీటర్ల వద్ద రహదారి కొట్టుకుపోవడంతో, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పగుళ్లు, భూమి కుంగిపోవడం వంటి సమస్యలు కూడా తలెత్తాయి. తాత్కాలిక మార్గాలు ఏర్పాటుచేసి అత్యవసర వాహనాల రాకపోకలకు మాత్రమే అనుమతి ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ పరిస్థితిపై కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, అభివృద్ధి శాఖల మంత్రి జీ. కిషన్ రెడ్డి స్పందించారు. లట్టిపూర్ వద్ద ఏర్పడిన దుస్థితిపై రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతోపాటు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు వెల్లడించారు. "వరద నీరు తగ్గిన వెంటనే రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం గ్రావెల్ ఫిల్లింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. కేంద్ర రహదారి శాఖ అధికారులు, ఇంజినీర్లు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారు. అక్టోబర్ 31 మధ్యాహ్నం నాటికి ట్రాఫిక్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నారు," అని మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం హైవే చుట్టుపక్కల ప్రాంతాల్లో భూమి కుంగిపోవడం, రహదారి పగుళ్ల కారణంగా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు తాత్కాలిక మార్గాలు సృష్టించి అత్యవసర వాహనాలు, సేవల రాకపోకలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. పూర్తి పునరుద్ధరణకు వాతావరణ పరిస్థితులు అనుకూలించగానే వేగంగా పనులు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

## వరంగల్ నగరానికి రక్షణ చర్యలు చేపడతాం

- మంత్రి కొండా సురేఖ
- వరద ముంపు ప్రాంతాలను సందర్శించిన మంత్రి



**బలగం టీవీ, వరంగల్**

మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ నగరంలో ఏర్పడిన వరద ముంపు పరిస్థితులను నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. వరద బాధితులు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం వారందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గురువారం మంత్రి కొండా సురేఖ, లోక్‌సభ సభ్యురాలు డా. కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డా. సత్య శారదతో కలిసి వరద ముంపు ప్రాంతాలను సందర్శించి ప్రజలను పరామర్శించారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల పరిస్థితిని పరిశీలించి, అధికారులు చేపడుతున్న సహాయక చర్యలను సమీక్షించారు.

తుఫాన్ కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు కురిసాయని మంత్రి తెలిపారు. "గత ఐదేళ్లుగా ముంపు పరిస్థితులు తలెత్తుతున్నాయి. నగర పరిధిలో లోతట్టు ప్రాంతాలు ఉండటం, కొన్ని ప్రదేశాలు ఆక్రమణలకు గురికావడం, సరైన వెడల్పుతో నాలాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమవుతోంది" అని చెప్పారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, డిఆర్‌ఎఫ్ బృందాల ద్వారా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. "ఇకముందు ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. "వర్షాల వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోంది" అని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరదల కారణంగా సంభవించిన నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్య రాణి, కార్పొరేటర్ పల్లం పద్మరవి, డిఎఓ అనురాధ, డిఎంహెచ్‌ఓ డా. సాంబశివరావు, తహసీల్దార్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శరీరం కాలిన వారికి ఉచిత ప్లాస్టిక్ సర్జరీలు

- పెగాసిస్టమ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- నేటి నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రమాదవశాత్తు శరీరం కాలి గాయాలైన వారికి ఉచిత ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించనున్నట్టు "బర్న్ సర్వైవర్ మిషన్ సేవియర్ ట్రస్ట్" (బీఎస్ఎంఎస్) తెలిపింది. పెగాసిస్టమ్ ఆధ్వర్యంలో ఈ ఉచిత ప్లాస్టిక్ సర్జరీలు జరుగుతాయని బీఎస్ఎంఎస్ సలహాదారు నాగరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉచిత సర్జరీ కోసం శుక్రవారం (అక్టోబర్ 31) నుంచి నవంబర్ 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాల వల్ల కొందరికి శరీరంలోని కొన్ని భాగాలు కాలిపోతుంటాయని చెప్పారు. అలాంటివారు తమ రూపాన్ని చూసుకొని ఆత్మన్యూనత భావానికి గురవుతుంటారని అన్నారు. వారికి అవసరమయ్యే ప్లాస్టిక్ సర్జరీలు చాలా ఖరీదు అనీ, అందుకే చాలామంది ఈ సర్జరీలకు దూరంగా ఉండిపోతుంటారని పేర్కొన్నారు. అలాంటి బాధితులకు ఉచితంగా సర్జరీలు చేయించేందుకు ముందుకు వచ్చిన పెగాసిస్టమ్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కాలిన గాయాల బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం 7816079234 నెంబర్ లో సంప్రదించాలని కోరారు.

## మొంథా తుపాన్‌తో ఏపీకి రూ.5,265 కోట్ల నష్టం

**ముందస్తు చర్యల వల్ల ప్రాణ నష్టం తప్పింది**
**సీఎం చంద్రబాబు**


**బలగం టీవీ, అమరావతి**

మొంథా తుపాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మొత్తం రూ.5,265 కోట్ల మేర నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా వేశామని చెప్పారు. ఇందులో రోడ్లు, భవనాల శాఖకు రూ.2,079 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.829 కోట్లు నష్టం జరిగిందన్నారు. తుపాన్ ప్రభావంతో ప్రాణనష్టం ఏమీ జరగకపోవడం సంతోషకరం అని పేర్కొన్నారు. అయితే 120 పశువులు మృత్యువాత పడ్డాయని తెలిపారు. నీటిపారుదల శాఖకు ఈసారి తక్కువ నష్టం జరిగిందని వివరించారు. సీఎం చంద్రబాబు తుపాన్ నష్టంపై సమీక్ష సమావేశం నిర్వహించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. తుపాన్ తీవ్రతను ముందుగానే అంచనా వేసి, ముందస్తు చర్యలు తీసుకోవడంతోనే నష్టం తగ్గిందని అన్నారు. "ప్రతి కుటుంబం, ప్రతి ఇంటిని జియోట్యాగింగ్ చేయగలిగాం. తుపాన్ సమయంలో విద్యుత్ సరఫరా నిలిచినా, మూడు గంటల్లోనే పునరుద్ధరించగలిగాం. ఇంతకు ముందు ఇది గంటల తరబడి పడేది," అని చంద్రబాబు గుర్తుచేశారు.

"ప్రకృతి విపత్తులను ఆపలేము కానీ, సకాలంలో తీసుకునే చర్యలతో నష్టాన్ని తగ్గించవచ్చు" అని సీఎం పునరుద్ఘాటించారు. వర్షాలు కురుస్తున్నా చెట్లు కూలిన ప్రదేశాలను వెంటనే క్లియర్ చేయడం ద్వారా ఇబ్బందులు లేకుండా చేసామని అన్నారు. అధికార యంత్రాంగం మొత్తం నిబద్ధతతో పనిచేసిందని సంతోషం వ్యక్తం చేశారు.

**రైతులందరికీ అండగా ఉంటాం : పవన్ కళ్యాణ్**

డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "మొంథా తుపాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటాం" అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.38 లక్షల హెక్టార్లలో పంట నష్టం సంభవించిందని, ఇందులో కృష్ణా జిల్లాలోనే 46 వేల హెక్టార్లు నష్టపోయాయని వివరించారు. మొత్తం 56 వేల మంది రైతులు ప్రభావితులయ్యారని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇస్తూ, "ప్రతి రైతును ఆదుకుంటాం" అని హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ పరిధిలో సుమారు 274 కిలోమీటర్ల రహదారులు దెబ్బతిన్నాయని చెప్పారు. "సీఎం చంద్రబాబు ముందుచూపుతో తీసుకున్న జాగ్రత్తల వల్లే పెద్ద నష్టం తప్పింది" అని పవన్ పేర్కొన్నారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస శిబిరాల్లో ఉన్న కుటుంబాలకు 25 కేజీల బియ్యం, ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. అదనంగా 1 కిలో కందిపప్పు, 1 లీటర్ పామాయిల్, 1 కిలో ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార ఉచితంగా అందజేస్తామని వెల్లడించారు.



## అజారుద్దీన్‌కి మంత్రి పదవిపై బీజేపీ ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో కాంగ్రెస్ అధిష్ఠానం మాజీ క్రికెటర్, మాజీ ఎంపీ మహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి కేటాయించడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది. ఈ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన కిందకే వస్తుందని బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై బీజేపీ నేతలు గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కలిసి అధికారికంగా ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నవంబర్ 11న ఉప ఎన్నిక జరగనున్న నేపథ్యంలో, ఈ నియామకం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడమేనని వారు పేర్కొన్నారు. "ఇలాంటి సమయంలో మంత్రి పదవి కేటాయించడం ద్వారా కాంగ్రెస్ ఓ వర్గం ఓటర్లను ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తోంది" అని బీజేపీ ఆరోపించింది. బీజేపీ నేతలు మాట్లాడుతూ, "ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి పదవి కేటాయించడం ప్రజాస్వామ్యానికి అవమానం. ఇది ఎన్నికలపై ప్రత్యక్ష ప్రభావం చూపే ప్రయత్నం. ఎన్నికల సంఘం వెంటనే జోక్యం చేసుకుని ఈ నియామకాన్ని రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు

## భారీ వర్షాలతో రైతుల ఇబ్బందులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు వరదలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. అనేక చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. భారీ వర్షాలతో పలు చోట్ల మరణాలు సంభవించాయి. పశువులు భారీ సంఖ్యలో మృత్యువాత పడ్డాయి. కరీంనగర్ జిల్లాలో సుమారు 2036 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్టు అధికారులు అధికారికంగా అంచనా వేశారు. కానీ వాస్తవంగా దాదాపు 50వేల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం తడిసినట్టు ఆయా మండలాల నుంచి నివేదికలు వస్తున్నాయి. పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిలాల్లో కూడా అధికారులు అధికారికంగా 2వేల నుంచి 2500 మెట్రిక్‌టన్నుల ధాన్యానికి నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా నివేదికను కలెక్టర్లకు పంపారు. బుధవారం నాటి భారీ వర్షానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇప్పటికే ప్రారంభించిన 120 కొనుగోలు కేంద్రాల్లో సుమారు లక్షకుపైగా మెట్రిక్‌టన్నుల ధాన్యం చేతికొచ్చే పరిస్థితి లేదు. గురువారం ఉదయం నుంచి ఎండ కొడుతుండటంతో ఆరబోస్తుండగా అక్కడక్కడా బూజు వచ్చిన పరిస్థితీ కనిపించింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని బుడగజంగాల కాలనీ, ఎస్సీ కాలనీ ఇండ్లలోకి వరద నీరు చేయడంతో బురదమయం అయ్యాయి. కరీంనగర్ జిల్లా శివారులోని మల్కాపూర్ పరిధిలోని శ్రీలక్ష్మిహోమ్స్‌కాలనీ నీట మునగడంతో కాలనీవాసులు రోడ్డుపై బైటాయించారు. అధికారులకు వారిని సముదాయించడంతో ధర్నా విరమించారు. కరీంనగర్ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లో రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. సైదాపూర్ ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారు. ఇందుర్తి – కోహెడ మధ్య లోలెవల్ వంతెపై నుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తూ చుట్టుపక్కల సుమారు 2కిలోమీటర్ల మేర ఇసుక మేటలు వేసిన పొలాల రైతులతో మంత్రి మాట్లాడారు.

రంగారెడ్డి జిల్లాలో తీవ్ర పంట నష్టం జరిగింది. రెండ్రోజుల పాటు కురిసిన వర్షానికి 48 గ్రామాల్లో పంట నష్టం వాటిల్లింది. సుమారు 466 ఎకరాల్లో 311 మంది

# పెండింగ్ ఫీజులు విడుదల చేయాలి

- **లేకుంటే ఎమ్మెల్యేలు, మంత్రులను అడ్డుకుంటాం.**
- **ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు**
- **రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలలు, యూనివర్శిటీలు బంద్ జయప్రదం**




బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మార్పు కావాలనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు సంక్షేమం విస్మరించిందని, 23 నెలలుగా విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలు పెండింగ్ ఫీజు బకాయిలు మరియు స్కాలర్ షిప్స్ కోసం రోడ్డెక్కారు . అయినా ప్రభుత్వం సమస్య పరిష్కారం చేయకుండా ఇంకా జఠిలం చేస్తుందని తక్షణమే రాష్ట్రంలో ఉన్న పెండింగ్ స్కాలర్ షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బంద్ జయప్రదం అయ్యింది.ఈ సందర్భంగా హైదరాబాద్లో లో బంద్ సందర్భంగా నారయణ గూడ నుండి వైఎంసిఎ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు లుమాట్లాడారు.

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఫీజులు కోసం విద్యార్థులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుని వచ్చిందని గత ప్రభుత్వం బకాయిలు కూడా చెల్లిస్తామని చెప్పి అవి చెల్లించక పోగా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవ్వాల్సిన 4600 కోట్లు బకాయిలు కూడా విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ చేసిన సందర్భంగా ప్రభుత్వం చర్చలు జరిపి 1200 కోట్లు ఇస్తామని ప్రకటించిందని ప్రకటించిన విధంగా దసరాకు 300 కోట్లు, దీపావళి కి 900 కోట్లు నవంబర్ మరో 300 కోట్లు ఇస్తామని చెప్పి చెల్లించకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు పడెలా చేస్తుందని అన్నారు.రాష్ట్రంలో ఫీజులను చెల్లించమని అడుగుతుంటే విజిలెన్స్ దాడులు పేర విద్యార్థులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. విజిలెన్స్ దాడులు పేరుతో విద్యాసంస్థలే ఫీజు రీయంబర్స్ పథకం వద్దనేలాగా చేసి, ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫీజులను చెల్లించి సమస్యను పరిష్కరించాలని లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అడుగడుగునా అడ్డుకుంటామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఇచ్చిన బంద్ జయప్రదం అయ్యిందని తెలిపారు.

రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కిరణ్, కె.అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనకు మేం కట్టుబడి ఉన్నామంటున్న రేవంత్ రెడ్డి నిర్బంధం ప్రయోగించి బంద్ అణాచాలనే ప్రయత్నం చేయడం దుర్మార్గపు చర్య అని తక్షణమే హైదరాబాద్, కరీంనగర్ జిల్లాలో అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని అన్నారు.

రాష్ట్రంలో విద్యరంగంలో అడుగడుగునా సమస్యలు ఉన్నాయని పెండింగ్ ఫీజులను విడుదల చేయకపోవడం, బెస్ట్ బకాయిలు విడుదల చేయకపోవడం అనేక సమస్యలు ఉన్నాయని రాష్ట్ర విద్యారంగం నిద్రావస్థలో ఉందన్నారు. ఫీజులను విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని. తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరాను బస్సులు అడ్డుకుంటుండుగా అక్రమంగా అరెస్ట్ చేశారు. ఉస్మానియాలో బంద్ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్ట్ చేశారు. కరీంనగర్, మహబూబ్ నగర్ లో పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. ఈ అక్రమ నిర్బంధాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ భారీ ప్రదర్శనలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్, హైదరాబాద్ జిల్లా నాయకులు స్టాలిన్, నాగేందర్, మనోజ్, ఆంజనేయులు, శివ గణేష్ ,కార్తీక్,శ్రీకాంత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల సమస్యల పరిష్కారానికి మూడు దశల ఆందోళన

- **నవంబర్ 12, 13న పాఠశాలల ముందు, నవంబర్ 24న ఐటీడీఏ కార్యాలయం వద్ద, డిసెంబర్ 12న కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసనలు**
- **టీపిటీఎఫ్**

బలగం టీవీ, హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ టీపిటీఎఫ్ మూడు దశల ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి లు గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. దిలీప్ కుమార్ కు ప్రత్యక్ష నోటీసు అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధికారులకు మరియు ప్రజాప్రతినిధులకు అనేకసార్లు సమస్యలను వివరించినప్పటికీ పరిష్కారం లేకపోవడంతో ఉద్యమానికి దిగాల్సి వస్తోందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి భాగంగా మూడు దశల ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నవంబర్ 12, 13న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆశ్రమ పాఠశాలల ఎదుట నిరసనలు, నవంబర్ 24న ఆయా ప్రాంతాల ఐటీడీఏ కార్యాలయాల వద్ద, డిసెంబర్ 12న కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి ప్రమోషన్లు కల్పించాలని, కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్లను రెగ్యులరైజ్ చేసి టైం స్కేలు వర్తింపజేయాలని, అన్ని పాఠశాలలకు నిర్దేశిత ప్యాటర్న్ ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.అదే విధంగా ఆశ్రమ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయడంతో పాటు ప్రతి పాఠశాలలో సర్వీస్ పర్సన్లను నియమించాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహాలకు ప్రత్యేకంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు మంజూరు చేయాలని సూచించారు. అన్ని పాఠశాలలకు డిజిటల్ బోధనోపకరణాలు, సైన్స్ పరికరాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని, నాన్‌బోర్డర్ విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు అందించాలని కోరారు.

## ఫీజు బకాయిలు ఇవ్వమంటే విజిలెన్స్ దాడులా..?

- **ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్**

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ,పీజీ,ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు నవంబర్ 3నుండి నిరవధిక బంద్ చేస్తామని ప్రకటిస్తే ప్రభుత్వం ఫీజు బకాయిల నిధులు నిర్వీర్యం అవుతున్నాయని విజిలెన్స్ దాడులు చేస్తున్నామని ప్రకటిస్తూ ప్రైవేట్ ఉన్నత కళాశాలల యాజమాన్యాలను బ్లాక్మెయిల్ చేస్తున్నారని,విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వమంటే తనిఖీల పేరుతో బెదిరింపులు చేయడం సరికాదని, ఫీజు బకాయిలు మొత్తం ఇచ్చిన తర్వాతే తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వంకు తనిఖీలు ఈరోజు గుర్తుకువచ్చాయని ఇన్ని రోజులు ఎందుకు రాలేదని? రాష్ట్రంలో 8వేల కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులు చదువులతో చెలగాటమాడుతుందని సీఎం రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే ఒకే సారీ ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పారని, అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి ప్రతినెల 500 కోట్ల బకాయిలు విడుదల చేస్తామని చెప్పి హామీ విస్మరించారని,యాజమాన్యాలు బకాయిల విడుదల కోసం

దసరా పండుగ ముందు సమ్మె చేస్తే దసరా,దీపావళి పండుగ లోపు యాజమాన్యాలకు 1200 కోట్లు విడుదల చేస్తామని చెప్పి మోసగించి ఇప్పటికీ కేవలం 300 కోట్లు మాత్రమే విడుదల చేశారని, ఓవైపు విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేక, యాజమాన్యాలు కళాశాల నిర్వహణ చేయలేక సిబ్బందికి జీతాలు ఇవ్వలేక ఇబ్బందులు పడుతూన్నారని బకాయిలు విడుదల అయ్యే వరకు నవంబర్ 3నుండి నిరవధిక బంద్ చేస్తామని యాజమాన్యాలు ప్రకటిస్తే విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా విజిలెన్స్ తనిఖీల పేరుతో బెదిరింపులు చేయడం సిగ్గుచేటని ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల విషయంలో నిర్లక్ష్యం చేయకుండ వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ ఉద్యమిస్తూ మంత్రులను, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని మణికంఠ రెడ్డి పుట్ట లక్ష్మణ్ హెచ్చరించారు.

## ప్రేమ జంట ఆత్మహత్య..

- **ప్రేమకు పెద్దల అంగీకారం లభించలేదని.. రెండు రోజుల వ్యవధిలో..**

**బలగం టీవీ, రంగారెడ్డి:**



రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల గ్రామంలో ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర విషాదాన్ని నింపింది. గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్న పంబాల నందిని (18), మంకు నాగరాజు (25) రెండు రోజుల వ్యవధిలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. నందిని, నాగరాజు తమ ప్రేమ విషయం పెద్దలకు చెప్పగా, వారి తల్లిదండ్రులు వెంటనే అంగీకరించలేకపోయారు. ఇంట్లో వారికంటే ముందు వివాహం కావలసిన వారు ఉన్నారని, అందుకే కొంత కాలం ఆగాలని వారికి సూచించారు. పెద్దల మాటలతో మనస్తాపానికి గురైన నందిని సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తమ కూతురి మరణానికి నాగరాజే కారణమంటూ ఆరోపిస్తూ, నందిని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. ప్రియురాలి ఆత్మహత్య, ఆపై తమపై నందిని కుటుంబం చేసిన నిందలు తెలుసుకున్న నాగరాజు తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ప్రియురాలి వియోగాన్ని, నిందలను తట్టుకోలేక బుధవారం రోజున నాగరాజు కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నందిని ఆత్మహత్యను తట్టుకోలేకే నాగరాజు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాడని అతని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఈ విషాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వరద ఉధృతికి బైక్‌తో సహా కొట్టుకుపోయిన యువతీ యువకుడు..

- **చెట్టు కొమ్మను పట్టుకుని బయటపడ్డ యువకుడు.. గల్లంతైన యువతి..**

**బలగం టీవీ, జనగామ**



జనగామ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ఉధృతి పెరిగి విషాదం చోటుచేసుకుంది. తిమ్మంపేట మండలం బోళ్ల మత్తిడి వద్ద స్టేషన్ ఘనపూర్–జాఫర్‌ఘడ్ రహదారిపై ప్రవహిస్తున్న వరదలో బైక్‌తో సహా కొట్టుకుపోయిన ఓ యువతి యువకుడిలో, యువకుడు క్షేమంగా బయటపడగా, యువతి గల్లంతైంది.

బోళ్లమత్తిడి వద్ద రోడ్డుపై నుంచి ప్రమాదకర స్థాయిలో వరద నీరు ప్రవహిస్తుండగా, శివకుమార్, శ్రావ్య అనే యువతీ యువకుడు బైక్‌పై దాన్ని దాటేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వరద ఉధృతికి వారు బైక్‌తో సహా కొట్టుకుపోయారు. అయితే, ప్రాణాల కోసం పోరాడిన శివకుమార్ పక్కనే ఉన్న చెట్టు కొమ్మను పట్టుకుని సురక్షితంగా బయటపడ్డాడు. కానీ, అతనితో పాటు ఉన్న శ్రావ్య అనే యువతి మాత్రం వరద ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతైంది. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం, గల్లంతైన యువతి శ్రావ్య కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

## హరీశ్‌రావు తండ్రికి ఎమ్మెల్సీ కవిత నివాళి

బలగం టీవీ, హైదరాబాద్



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి ఎమ్మెల్సీ కవిత నివాళులర్పించారు. కవితతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ కూడా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు కుటుంబ సభ్యులకు కవిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల తెల్లవారుజామున తన్నీరు సత్యనారాయణ కన్నుమూసిన విషయం తెలిసిందే. అనారోగ్య సమస్యలతో కొంతకాలంగా బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు.

## తుఫాన్ బాధిత రైతులకు భరోసా ఇవ్వాలి

- **పంట నష్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి**
- **సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**బలగం టీవీ, ఖమ్మం**



మొంథా తుఫాన్‌తో రైతుల చేతికి వచ్చిన పంటలు తుడిచిపెట్టుకుపోయాయని, తుఫాన్ బాధిత రైతులకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ భరోసా కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో జాన్ వెస్లీ నాయకత్వంలోని సీపీఐ(ఎం) బృందం పంటలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో 10 జిల్లాల్లో తుఫాన్ కారణంగా పంటలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. తుఫాన్‌తో వీచిన బలమైన గాలులు, వర్షాల వల్ల పంటపొలాలు నీటమునిగిపోయాయని, నేలవారిపోయాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తీత దశకు చేరుకున్న పత్తి పంట చేనులోనే వర్షానికి తడిసి ముద్దైందని, సుమారు 30 వేల ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నదని వివరించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమని జాన్ వెస్లీ అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టంపై విచారణ జరిపి కేంద్రానికి నివేదిక పంపాలని, కేంద్ర ప్రభుత్వం తాత్సర్యం చేయకుండా వెంటనే ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇచ్చేలా నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షానికి తడిసి నష్టపోయిన పంటలను మార్కెట్ ధరకు కొనుగోలు చేసి రైతుల మనోధైర్యాన్ని కాపాడాలని సూచించారు. తుఫాన్ నష్టంపై ప్రభుత్వం సరిగా స్పందించకపోతే, బాధిత రైతులతో కలిసి ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు అబ్బాస్, రమావత్ శ్రీరాం నాయక్, స్కైలాబ్ బాబు, ఎర్ర శ్రీనివాసరావు, మెరుగు రమణ, నవీన్ రెడ్డి, మండల కార్యదర్శి కే. నరేంద్ర, నాయకులు కరకపల్లి రాయమల్లు, రావూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన ప్యాక్స్ చైర్మన్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాలలో అకాల వర్షం "మొంథా" తుఫాన్ వలన తడిసిన ధాన్యం పరిశీలించిన ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ గౌడ్. తంగళ్లపల్లి మండలంలోని పంట నష్టపోయిన రైతులను అదుకునే విధంగా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.పంట చేతికి వచ్చాక అకాల వర్షం రావడం దురదృష్టకరమన్నారు. తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రైతు నుండి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## మహిళకు అసభ్యకరమైన సైగలు..

### వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు..

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ దేవస్థానం సమీపంలో ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, అభ్యంతరకరమైన సైగలు చేశాడనే ఆరోపణలతో వెల్దండి సదానందం అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. టౌన్ పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. బాధితురాలి నుంచి అందిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దేవస్థానం పరిసరాల్లో మహిళకు అసభ్యకరమైన సైగలు చేస్తూ ఇబ్బంది కలిగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై తక్షణమే స్పందించిన పోలీసులు, నిందితుడు వెల్దండి సదానందం ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు అనంతరం విచారణ పూర్తయ్యాక, సదానందం ను రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ తెలిపారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.



## సిరిసిల్ల శ్రీనగర్ కాలనీ జలదిగ్బంధం

- ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం
- శాశ్వత కాలువ నిర్మాణం చేపట్టాలి
- బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బుధవారం రోజున సిరిసిల్ల పట్టణంలో కురిసిన భారీ వర్షం కారణంగా శ్రీనగర్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాలనీ మొత్తం బురదమయంగా మారి, ప్రధాన రహదారులపైకి వరద నీరు పోటెత్తడంతో పాటు అనేక ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు కనీస జీవనానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. కాలువలు పూర్తిగా పూడికతో మూసుకుపోవడం వలన రోడ్లపై కుంటలు ఏర్పడి, పౌరుల జీవన విధానం స్తంభించింది. ఈ నేపథ్యంలో బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ ఈ పరిస్థితిపై తీవ్రంగా స్పందించారు. ఆయన కాలనీని సందర్శించి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా దుమాల శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ, "ప్రతిసారీ వర్షం కురిసినప్పుడల్లా ఇదే దుస్థితి పునరావృతమవుతోంది. ఇది స్థానిక అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. శ్రీనగర్ కాలనీతో పాటు పట్టణంలోని అన్ని సమస్యాత్మక ప్రాంతాలలో ప్రభుత్వం వెంటనే స్పందించి, శాశ్వత కాలువ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి" అని డిమాండ్ చేశారు. కొత్తచెరువు నుండి వస్తున్న వరద నీటికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. "ప్రజల పన్నులతో నడుస్తున్న ప్రభుత్వం ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి. వర్షం ఆగిన తర్వాత కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరం. ప్రతి వర్షం తర్వాత ప్రజలు ఈ బాధలు అనుభవించటం అసహనం కలిగిస్తుంది" అని శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను పట్టించుకోని ఈ నిర్లక్ష్య ధోరణి కొనసాగితే, భారతీయ జనతా పార్టీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతుందని దుమాల శ్రీకాంత్ హెచ్చరించారు. "ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షించడం ప్రభుత్వ ధర్మం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు సూరం వినయ్, దేవరాజు, రామారావు, నరసయ్య, కనకయ్య, వెంకట్రావు తదితరులు శ్రీనగర్ కాలనీని సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోని, బాధితులకు సంఘీభావం తెలిపారు.

# బనప్ప చెరువు గండి

- రామచంద్రపూర్ రైతుల 50 ఎకరాల పంటకు నష్టం..!

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



తంగళ్లపల్లి మండలం పరిధిలోని రామచంద్రపూర్ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారు. దాచారం గ్రామ శివారులో ఉన్న బనప్ప చెరువుకు బుధవారం అకస్మాత్తుగా గండి పడింది. దీని కారణంగా చెరువులోని నీరు ఉధృతంగా పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి ప్రవహించింది. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో పండిన పంట పొలాలను వరద నీరు ముంచెత్తింది. ముఖ్యంగా, చేతికి వచ్చి కోతకు సిద్ధంగా ఉన్న వరి, ఇతర పంటలన్నీ పూర్తిగా నీట మునిగి నెల మట్టం అయ్యాయి.

నష్టపోయిన రైతులు పొన్నాల చక్రపాణి, పొన్నాల పర్శరాములు, గడ్డం బాపు రెడ్డి, చౌదరి అంజయ్య, గడ్డం సంజీవరెడ్డి, గంధం రమేష్, మేకల బాలయ్య, కదేశి మల్లేశం, బత్తుల మహేష్, గంధం శివ, గంధం శ్రీనివాస్ మరియు ఇతర రైతులు తమ పంటలను కోల్పోయారు. కష్టపడి పండించిన పంటలు కళ్లముందే నీటి పాలవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



- బీజేపీ పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్
- తడిసిన ధాన్యంపై బీజేపీ ఆందోళన:

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోయిన రైతుల సమస్యలపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సిరిసిల్ల పట్టణ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈరోజు (గురువారం) ఉదయం చిన్న బోనాల వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ నాయకులు సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించారు.

ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. రైతులు పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, ప్రభుత్వం ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. "రైతు పంట తడిసి నష్టపోతున్నా, ప్రభుత్వం మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని, వెంటనే నష్టపోయిన రైతులకు సరైన నష్టపరిహారం ప్రకటించి, పాడైపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించాలి," అని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుమాల శ్రీకాంత్ తీవ్రంగా విమర్శించారు. "రైతుల కన్నీళ్లు తుడవడంలో విఫలమైన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతు కష్టాలపై ఒక్క చర్య కూడా తీసుకోలేదు. ఫొటోలు, ప్రకటనలతో కాకుండా రైతు పంటను కాపాడటమే నిజమైన పాలన," అని హెచ్చరించారు.తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, అలాగే వాహనాలు, హమాలి (కూలీలు), గోనె సంచుల వ్యవస్థను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ రైతు పక్షానే ఉంటుంది. రైతు న్యాయం కోసం, పంట రక్షణ కోసం అవసరమైతే వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు కంబోజు శ్రీధర్, నరసయ్య, ప్రధాన కార్యదర్శి మెరుగు శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షులు సుంకరి బాలకిషన్, అధికార ప్రతినిధి చొప్పదండి శ్రీనివాస్, దూడం సురేష్, కార్యదర్శి శివరాం వినయ్ దేవరాజు, ఇంజపురం మురళి, గాలి శ్రీనివాస్, వడ్నాల శేఖర్ బాబు, రామారావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## పవర్‌లూమ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 20న ధర్నా

- పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



పవర్‌లూమ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, నవంబర్ 20వ తేదీన హైదరాబాద్ చేనేత జౌళి శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్ తెలిపారు.బుధవారం రోజున అమృత్యలాల్ శుక్ల కార్మిక భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ముశం రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ డిమాండ్లను నవంబర్ 20 లోపు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఈ పథకానికి నిర్మించిన షెడ్లను ఇతర కార్యక్రమాలకు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ చీరలకు ఉత్పత్తి చేస్తున్న వాటికి యారన్ సబ్సిడీని ప్రకటించి అమలు చేయాలని, పవర్‌లూమ్ కార్మికులందరికీ వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడం వలన 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు పెన్షన్ అందడం లేదని, పవర్‌లూమ్ విద్యుత్ సమస్యలను పరిష్కరించి, అదనంగా వేసిన బ్యాక్ బిల్లును వెంటనే రద్దు చేయాలని తెలిపారు.

సెస్ అధికారులు విద్యుత్ బకాయిలు, బ్యాక్ బిల్ పేరుతో తరచూ పరిశ్రమలకు కరెంట్ కట్ చేయటం వలన కార్మికులు ఉపాధి పోవడం జరుగుతుందని అన్నారు. 2023లో ఇతర రాష్ట్రాల కార్మికులకు (బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాం వంటి పనుల కోసం) రావాల్సిన యారన్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుతం ఉత్పత్తి చేస్తున్న ప్రభుత్వ చీరలకు యారన్ సబ్సిడీ ప్రకటించడం జరగలేదు దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుంది అని అన్నారు. త్రీప్ట పథకం అమలు చేయడంలో ఆలస్యం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో చేనేత పవర్లూమ్ రాష్ట్ర అధ్యక్షులు చెరిపెల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జరిగే ధర్నాలో కార్మికులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోడం రమణ, పట్టణ అధ్యక్షులు నక్క దేవదాస్, జిల్లా నాయకులు బే జిగం సురేష్, స్వర్గం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ డీపీతో సైబర్ మోసం.. ముగ్గురు అరెస్ట్..

**బలగం టీవీ, అమరావతి**

ఏపీ మంత్రి నారా లోకేష్ ఫోటోను వాట్సాప్ డీపీగా పెట్టుకొని, ఆర్థిక సాయం పేరిట అమాయకులను మోసగించిన సైబర్ నేరగాళ్ల ముఠాను సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ మోసంలో బాధితుల నుండి ఏకంగా రూ. 54.34 లక్షలు కొల్లగొట్టినట్లు అధికారులు గుర్తించారు.సైబర్ నేరగాళ్లు సామాజిక మాధ్యమాలను అడ్డం పెట్టుకొని మోసాలకు పాల్పడ్డారు. సైబర్ నేరగాళు ఎక్స్‌లో హెల్ప్ ఎట్ నారా లోకేష్, హెల్ప్ ఎట్ ఎన్‌సీబీఎన్, హెల్ప్ ఎట్ పవన్ కళ్యాణ్ వంటి హాష్ ట్యాగ్‌లు ఉపయోగించి వైద్య పరీక్షలు, చికిత్సల కోసం ఆర్థిక సాయం చేస్తామంటూ ప్రజలను ట్రాప్ చేశారు. ముఠాలోని ప్రధాన నిందితుడు, కొండూరి రాజేష్ (ఏ1), నారా లోకేష్ ఫోటోను వాట్సాప్ డీపీగా పెట్టుకొని, తాను టీడీపీ ఎన్‌ఆర్‌ఐ కన్వీనర్ అంటూ పరిచయం చేసుకున్నాడు. ఆర్థిక సాయం అడిగిన వారికి నకిలీ బ్యాంక్ క్రెడిట్ రసీదులు పంపి, డబ్బులు పంపించినట్లు నమ్మబలికాడు. కొన్ని రోజుల తర్వాత, సాయంగా పంపిన డబ్బులు బాధితుల ఖాతాల్లో జమ కావాలంటే, 4% రేమిటెన్స్ చార్జెస్ కట్టాల్సి ఉంటుందని నమ్మించారు. ఆ చార్జీలను తమకు పంపాల్సిందిగా కోరి, ఆ డబ్బులను వసూలు చేశారు. ఈ విధంగా పలువురిని మోసగించి మొత్తం రూ. 54.34 లక్షలు కొల్లగొట్టారు. ఈ సైబర్ మోసంపై ఫిర్యాదులు అందడంతో రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఏ1 కొండూరి రాజేష్, ఏ2 గుత్తికొండ సాయి శ్రీనాథ్, ఏ3 చిత్తడి తల సుమంత్‌లను అరెస్ట్ చేశారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీఐడీ అధికారులు తెలిపారు.

# సెమీస్‌లో టీమిండియా సంచలనం



- ఆస్ట్రేలియాపై చారిత్రాత్మక విజయం
- జెమీమా అజేయ శతకంతో హర్మన్‌సేన ఘనత
- ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో పోరు

**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో టీమిండియా చారిత్రాత్మకంగా అడుగుపెట్టింది. గురువారం నవీ ముంబై వేదికగా జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో హర్మన్‌సేన అద్భుత ప్రదర్శనతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ అజేయ శతకంతో టీమిండియా విజయానికి కీలకంగా మారగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ హాఫ్ సెంచరీతో సత్తా చాటింది. ఈ విజయంతో టీమిండియా మహిళల వన్డే ప్రపంచకప్ చరిత్రలో కొత్త రికార్డు నెలకొల్పి, 52 ఏళ్ల నిరీక్షణకు తెరదించే దిశగా ఒక అడుగు ముందుకేసింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు 49.5 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (119) శతకంతో చెలరేగగా, ఎలిస్ పెర్రీ (77), అష్లే గార్డ్నర్ (63) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. భారత బౌలర్లలో శ్రీ చరణి (2/49), దీప్తి శర్మ (2/61) రెండేసి వికెట్లు తీయగా, క్రాంతి గౌడ్, అమన్‌జోత్ కౌర్, రాధ యాదవ్ చెరో వికెట్ తీశారు.

338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ తొలి వికెట్ త్వరగా కోల్పోయింది. షెఫాలీ వర్మ (10), స్మృతి మంధాన (25) పెవిలియన్ చేరడంతో భారత్ కష్టాల్లో పడింది. కానీ జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ జోడీ మ్యాచ్ దిశను మార్చింది. ఇద్దరి మధ్య 167 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. హర్మన్‌ప్రీత్ 88 బంతుల్లో 89 పరుగులు చేసి ఔటయింది. జెమీమా రోడ్రిగ్స్ 134 బంతుల్లో 127 నాటౌట్ స్కోరుతో అజేయంగా నిలిచి భారత విజయాన్ని ఖరారు చేసింది.

ఆస్ట్రేలియా జట్టు ఫీల్డింగ్‌లో పలు తప్పిదాలు చేసింది. జెమీమా ఇచ్చిన మూడు సునాయాస క్యాచ్‌లు నేలపాలు చేయడంతో భారత్ గెలుపు సులభమైంది. మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు ఛేధించిన జట్టుగా టీమిండియా రికార్డు సృష్టించింది.

ఈ గెలుపుతో భారత్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా జట్టుతో తలపడనుంది. రాబోయే ఆదివారం నవీ ముంబై వేదికగా జరగనున్న ఫైనల్‌లో హర్మన్‌సేన 52 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలకాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# నేడు రెండో టీ 20



## మళ్లీ వర్షమే అడ్డంకి!

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ శుక్రవారం మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. మొదటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయిన నేపథ్యంలో, టీమ్ ఇండియా ఈసారి తన ప్లేయింగ్ ఎలెవన్‌లో పెద్ద మార్పులు చేసే అవకాశం కనిపించడం లేదు. మొదటి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేసిన ఆటగాళ్లనే రెండో టీ20లో కూడా కొనసాగించే అవకాశం ఉందని జట్టు వర్గాలు తెలిపాయి. కాగా, యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి వెన్నునొప్పి కారణంగా ఈ మ్యాచ్‌కూ దూరమయ్యాడు. అతనికి వైద్యులు రెండో, మూడో మ్యాచ్‌ల వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారని సమాచారం.దాంతో, కాన్‌బెర్రాలో ఆడిన అదే జట్టును మెల్‌బోర్న్‌లో కూడా ఆడే అవకాశం ఉంది. ఈ క్రమంలో అర్షదీప్ సింగ్‌కు మరోసారి అవకాశం దక్కకపోవచ్చు. అతని స్థానంలో హర్షిత్ రాణా కొనసాగవచ్చని భావిస్తున్నారు.

**భారత్ ప్రాబబుల్ ప్లేయింగ్ 11:**

అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా.

**రెండో టీ20కి వర్షం ముప్పు**

భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా జరగనున్న రెండో టీ20కు వర్షం రూపంలో భారీ అడ్డంకి ఏర్పడింది. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ ( వేదికగా శుక్రవారం మధ్యాహ్నం 1.40 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే, మ్యాచ్ సమయానికి 93 శాతం వర్షం పడే అవకాశం ఉందని AccuWeather అంచనా వేసింది. గురువారం నుంచే వర్షం కురిసే సూచనలు ఉండటంతో, మ్యాచ్ కూడా మొదటి టీ20లా వర్షార్పణం అయ్యే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ సూచిస్తోంది.

మెల్‌బోర్న్ స్టేడియానికి అత్యాధునిక మైదాన ఆరబెట్టే సాంకేతిక సదుపాయం ఉన్నప్పటికీ, వర్షం కాసేపు ఆగితేనే ఆట కొనసాగించవచ్చు. కానీ, వర్షం విరామం ఇచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కాన్‌బెర్రా వేదికగా జరిగిన తొలి టీ20 కూడా వర్షం కారణంగా రద్దైన విషయం తెలిసిందే.

మెల్‌బోర్న్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటివరకు మూడు ఫార్మాట్లలో కలిపి 14 సార్లు తలపడ్డాయి. అందులో ఆస్ట్రేలియా 7, భారత్ 4 గెలవగా, మూడు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. టీ20ల్లో ఇరు జట్లు నాలుగు సార్లు తలపడగా చెరో రెండు విజయం సాధించాయి. మెల్‌బోర్న్ మ్యాచ్ కూడా వర్షం వల్ల రద్దయితే, ఐదు టీ20ల సిరీస్ కేవలం మూడు మ్యాచ్‌ల సిరీస్‌గా మారిపోవచ్చు.

## ‘ది గర్ల్‌ఫ్రెండ్’ నుంచి ‘లాయీ లే’ సాంగ్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

నేషనల్ క్రష్ రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘ది గర్ల్‌ఫ్రెండ్’ నుండి కొత్త సింగిల్ ‘లాయీ లే’ పాటను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ చిత్రానికి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తుండగా, ధీక్షిత్ శెట్టి కథానాయకుడిగా నటిస్తున్నారు. నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం ప్రేమ, భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతోందని మేకర్స్ తెలిపారు. ‘లాయీ లే’ సాంగ్ రష్మికా–ధీక్షిత్ శెట్టి మధ్య ప్రేమకథను సున్నితమైన రీతిలో ఆవిష్కరిస్తూ, హృదయాన్ని తాకే స్వరాలతో ఆకట్టుకుంటుంది. ఈ మెలోడీకి హేశమ్ అబ్దుల్ వహాబ్ అద్భుతమైన సంగీతం అందించగా, గాయకుడు కపిల్ కపిలన్ తన గాత్రంతో ప్రాణం పోశారు. తెలుగు సాహిత్యాన్ని రాకేందు మౌళి రాసిన ఈ పాట ప్రేక్షకుల్లో మంచి స్పందన పొందుతోంది.






## మహాకాళి’ ఫస్ట్ లుక్ ఔట్

**బలగం టీవీ, హైదరాబాద్**

‘హనుమాన్’తో పాన్ ఇండియా స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకున్న ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో సూపర్‌హీరో మూవీ రాబోతోంది. ఆ చిత్రం పేరు ‘మహాకాళి’. ఈ చిత్రానికి పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇండియా నుంచి వస్తున్న మొదటి ఫీమేల్ సూపర్‌హీరో మూవీ కావడం విశేషం. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రమేష్ దుగ్గల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తుండగా, టైటిల్ రోల్‌లో కన్నడ నటి భూమిశెట్టి నటిస్తున్నారని చిత్రబృందం ప్రకటించింది. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో భూమిశెట్టి ఉగ్రరూపంలో మహాకాళిగా దర్శనమిచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. చిత్ర బృందం తెలిపిన వివరాల ప్రకారం, ఈ సినిమా బెంగాల్ నేపథ్యంతో సాగుతుంది. కాళీదేవి ప్రధానంగా నడిచే కథ ఇందులో ఉండబోతోంది. భారతీయ మహిళల సాధికారత, విశ్వాసం, ధైర్యానికి ప్రతీకగా ఈ కథ రూపొందుతున్నదని మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాను ఐమాక్స్ 3డీలో తెరకెక్కించి, భారతీయ భాషలతో పాటు విదేశీ భాషల్లో కూడా విడుదల చేయనున్నట్లు సమాచారం.




## దుల్కర్ సల్మాన్ ‘కాంత’ నుంచి మరో సాంగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్, నూతన నటి భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన పీరియాడికల్ యాక్షన్ థ్రిల్లర్ ‘కాంత’ త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సెల్వరాజ్ సెల్వమణి దర్శకత్వం వహించారు. 1950ల మద్రాస్ నేపథ్యంలో సాగే ఈ చిత్రం ఎమోషన్, యాక్షన్‌ల మేళవింపుతో తెరకెక్కింది. సినిమా నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. రిలీజ్ డేట్ దగ్గరపడడంతో ప్రమోషన్‌లను వేగవంతం చేశారు చిత్ర బృందం. ఇప్పటికే రెండు పాటలను విడుదల చేసిన మేకర్స్, తాజాగా మరో సాంగ్‌ను అభిమానుల ముందుకు తెచ్చారు. ఈ పాట ఇంగ్లిష్, తమిళం, తెలుగు ర్యాప్ లిరిక్స్ మేళవింపుతో రూపొందించబడింది. సింగర్ సిద్ధార్థ్ బస్రూర్ ఈ సాంగ్‌ను ఆలపించగా, సంగీతాన్ని జాను చంతర్ సమకూర్చారు. ఈ పాట సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌ను బాగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రాన్ని స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, వేఫేరర్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాతలుగా రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ వ్యవహరిస్తున్నారు. చిత్రంలో ప్రముఖ నటుడు సముద్రఖని ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు.

## బాహుబలి ఎపిక్‌లో తొలగించిన సన్నివేశాలు ఇవే..

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ సెన్సేషన్‌గా నిలిచిన ‘బాహుబలి’ చిత్రం ‘బాహుబలి : ది ఎపిక్’గా శుక్రవారం గ్రాండ్‌గా విడుదల కానుంది. రీ రిలీజ్ సందర్భంగా ప్రభాస్, రానా దగ్గుబాటితో కలిసి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజమౌళి తొలగించిన సీన్‌లపై స్పష్టత ఇచ్చారు.“అవంతిక లవ్ స్టోరీ, పచ్చబొట్టేసిన పాట, నా ఫేవరెట్ సాంగ్ ‘కన్నా నిదురించరా’, అలాగే రానా ఉన్న పాట– ఇవన్నీ ఎడిటింగ్‌లో కట్ అయ్యాయి. యుద్ధ సన్నివేశాలను కూడా కొంతవరకు ట్రిమ్ చేశాం. మీ ఇద్దరివీ సమానంగా తీసేశాం (నవ్వుతూ) కానీ అసలు కథ, ఎమోషన్స్ మాత్రం యథాతథంగా ఉన్నాయి,” అని జక్కన్న తెలిపారు.

# వర్షం తగ్గిన తర్వాత ధాన్యం ఆరబెట్టాలి..

- వరి కోతలు వాయిదా వేసుకోవాలి..
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

వర్షం తగ్గిన తర్వాతనే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. గురువారం తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంఛార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో రైతులు వరి కోతలు మరో రెండు రోజులు వాయిదా వేసుకోవాలని కోరారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత ధాన్యం ఆరబెట్టాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని రైస్ మిల్లర్లు అన్ లోడ్ చేసుకునేలా చూడాలని, సన్నరకం వడ్లను కూడా తీసుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జకొనుగోలు



కేంద్రంలో ధాన్యం కుప్పలు, వడ్ల తేమ శాతం పరిశీలించి, రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ల్ బేగం, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్ర ప్రకాశ్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.